విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక
అనంతపురం 5 శ్రీ సత్యసాయి
ఆదివారం 17 మే 2026

# స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా ధర్మవరంలో భారీ అవగాహన కార్యక్రమం



ధర్మవరం, మే16 (అనంత ప్రభ)

ధర్మవరం పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర -- ప్లాస్టిక్ రహిత రాష్ట్రం ధర్మవరం పట్టణంలోని కాలేజ్ సర్కిల్ వద్ద శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర -- ప్లాస్టిక్ రహిత రాష్ట్రం అవగాహన కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గారితో కలిసి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి మరియు ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గారు పాల్గొని ప్రజలకు స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ మరియు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అవగాహన ఫ్లెక్సీ ప్రజల దృష్టిని ఆకర్షించింది. ప్లాస్టిక్ వద్దంటే -- నో చెప్పండి, ప్రకృతిని కాపాడండి అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు ప్రత్యక్షంగా వివరించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ గారి స్వచ్ఛత ఆశయాలను సాకారం చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ గారు దేశవ్యాప్తంగా ప్రారంభించిన స్వచ్ఛ భారత్ మిషన్ దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణలో చారిత్రాత్మక మార్పుకు నాంది పలికిందన్నారు. దేశవ్యాప్తంగా 12 కోట్లకు పైగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగై, నీటి ద్వారా మరియు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు ప్రతి నెల రెండవ మరియు మూడవ శనివారాల్లో స్వచ్ఛత కార్యక్రమాలను ఉద్యమంలా నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిశుభ్రత అనేది ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి జీవన విధానంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా మంత్రి గారు స్వయంగా ధర్మవరం పట్టణంలోని పలు దుకాణాలు, వీధి వ్యాపారులు, బండి దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ కవర్లను వాడకుండా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా రోడ్డు పక్కన పూలు అమ్ముకునే ఒక మహిళా వ్యాపారస్తురాలు ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిరాకరించి పర్యావరణ హిత విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలుసుకుని మంత్రి గారు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఆమె సేవాభావాన్ని గుర్తిస్తూ అక్కడికక్కడే శాలువాతో ఘనంగా సన్మానించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టిక్ వల్ల భూమి, నీరు మరియు గాలి తీవ్రంగా కలుషితమవుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణంగా మనం ఉపయోగించే ఒక ప్లాస్టిక్ కవర్ భూమిలో పూర్తిగా కలవడానికి 16 నుంచి 20 సంవత్సరాలు పడుతుందని, ప్లాస్టిక్ బాటిల్స్ కరగడానికి 50 నుంచి 60 సంవత్సరాలు పట్టే పరిస్థితి ఉందన్నారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాల ప్రభావం కారణంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు భయంకరంగా పెరుగుతున్నాయని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 15.60 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, అందులో 8.75 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఏటా 75 వేలకుపైగా కొత్త కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు ఇప్పటికైనా అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. "మన పిల్లల భవిష్యత్తు కోసం ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పాల్సిన సమయం వచ్చింది" అని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన 85 లక్షల టన్నుల చెత్తను అలాగే వదిలేయకుండా, వేస్ట్ టు వెల్త్ విధానంలో సంపదగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. భవిష్యత్తులో ప్లాస్టిక్ వినియోగాన్ని నేరంగా పరిగణించేలా చట్టపరమైన చర్యలు కూడా తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. అయితే చట్టాల కంటే ముందుగా ప్రజల్లో స్వచ్ఛంద మార్పు రావాలని, ముఖ్యంగా వ్యాపారులు, హోటళ్లు, స్ట్రీట్ వెండర్లు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. మీడియా ప్రతినిధులు కూడా ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పిస్తూ పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. పరిశుభ్రమైన సమాజం ద్వారానే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యం. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా ధర్మవరాన్ని ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం అని మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ... ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలుగుతున్న నష్టాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈసారి ప్రత్యేకంగా ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వల్ల భూమి, నీరు మరియు గాలి తీవ్రంగా కలుషితమవుతున్నాయని, దీని ప్రభావం ప్రజల ఆరోగ్యంపై దీర్ఘకాలికంగా పడుతోందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వినియోగం ఒక అలవాటుగా మారిపోయిందని, ఇప్పుడు దానిని నియంత్రించడం ప్రతి పౌరుడి వ్యక్తిగత బాధ్యతగా మారిందన్నారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా, నెల రోజులపాటు క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో ఉన్న మెడికల్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్లాస్టిక్ వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ధర్మవరం పట్టణంలోని పలు స్ట్రీట్ వెండర్లను అధికారులు సందర్శించారు. ముఖ్యంగా పూలు అమ్ముకునే వ్యాపారులు కాగితపు కవర్లు ఉపయోగిస్తూ పర్యావరణ హిత విధానాన్ని అనుసరిస్తుండటం అభినందనీయమన్నారు. అయితే కొంతమంది బేకరీలు మరియు ఇతర వ్యాపార సంస్థలు ఇప్పటికీ ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నాయని, అలాంటి వారు వెంటనే ప్రత్యామ్నాయాల వైపు మారాలని సూచించారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఒక్కటే సరిపోదు. ముందుగా ప్రతి వ్యక్తిలో మార్పు రావాలి. వ్యక్తి మారితే సమాజం మారుతుంది. సమాజం మారితే మన పట్టణం, మన జిల్లా స్వచ్ఛంగా మారుతుంది" అని కలెక్టర్ పేర్కొన్నారు

## అనంతపురంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యటన కార్యకర్తల్లో జోష్ నింపింది




అనంతపురం, మే16 (అనంత ప్రభ)

అనంతపురం అర్బన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో ఎలాంటి విభేదాలు లేవు, ఉండబోవని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు స్పష్టం చేశారు. ఇందుకు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ గారి పర్యటనే నిదర్శనమన్నారు. అనంతపురం నగరంలో ఈనెల 14న జరిగిన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్యటనను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అందరం సమిష్టిగా కష్టపడి ఈ పర్యటన ఏర్పాట్లు చేశామన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో నారా లోకేష్ గారికి అనంతపురం నగరంలో ఘన స్వాగతం పలికారన్నారు. ఈ పర్యటనలో కార్యకర్తల జోష్ చూసి నారా లోకేష్ గారు కూడా ఎంతో సంతోషం వ్యక్తం చేశారన్నారు. అలాగే ఆయన చెప్పిన మాటలు కార్యకర్తలకు ఉత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చాయన్నారు. రాత్రి 11.30గంటల వరకు ఎంతో ఓపికగా ఉండి.. ప్రతి ఒక్కర్నీ పలుకరిస్తూ ఫోటో సెషన్ నిర్వహించారన్నారు. ఎక్కడా చిన్న ఆటంకం కల్గకుండా, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా కార్యకర్తల సమావేశం జరిగిందన్నారు. కార్యకర్తలు ఎంతో క్రమశిక్షణగా ఉండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. అర్బన్ నియోజకవర్గంలో విభేదాలు ఉన్నాయని ప్రచారం చేసే వారికి ఈ పర్యటన ఒక సమాధానం అన్నారు. మరోవైపు నారా లోకేష్ గారు ఇచ్చిన స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో పని చేస్తామన్నారు. గతంలో అర్బన్ నియోజకవర్గంలో గెలిచి ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి కానుకగా ఇస్తామని చెప్పి.. మాట నిలబెట్టుకున్నామన్నారు. ఈసారి 62డివిజన్లు, 4పంచాయతీల్లో గెలిచి.. నారా లోకేష్ గారికి కానుకగా ఇస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు తెలిపారు

## జూన్ రెండవ వారం లో బహుజన ఉద్యోగుల, వృత్తి నిపుణుల సదస్సు ను జయప్రదం చేయండి

అనంతపురం, మే 16 (అనంత ప్రభ)

అనంతపురం ఈరోజు ప్రేసక్లబ్ నందు ఆర్. ఈ. యఫ్ అధ్యక్షులు పత్రిక సమావేశంలో మాట్లాడుతూ గ్రేటర్ రాయల సీమ జిల్లాల పరిధిలో ఉన్న బహుజన ఉద్యోగుల మరియు వృత్తి నిపుణుల సదస్సు ను అనంతపురం జిల్లా కేంద్రంలో జరపాలని రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మరియు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి నాయకులు నిర్ణయం తీసుకోవడం జరిగింది.

ఈ సదస్సు లో నిజాయితీ గా ప్రజలకు సేవలు అందించిన ఉద్యోగులను సన్మానం చేయడం జరుగుతుంది. అని ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశంలో జి. నాగభూషణం, ఆర్. నారాయణ నాయక్ లు మాట్లాడారు.

ఈ సందర్బంగా వారు ఈ సదస్సు లో ప్రతి బహుజన ఉద్యోగి, వృత్తి నిపుణులు న్యాయవాదులు, డాక్టర్ లు, చార్టెడ్ అకౌంట్ టెంట్ లు, ఇంజనీర్ లు, పారిశ్రామిక వేత్తలు, పాల్గని తమ అభిప్రాయాలూ తెలపగలరు అని విజ్ఞప్తి చేస్తున్నారు.

సమాజంలో జరుగుతున్న సామజిక వివక్ష, ఆర్థిక దోపిడికి వ్యతిరేకంగాను మెజారిటీ ప్రజల హక్కు ల పరిరక్షణ కోసం, రాజ్యాంగ విలువలను కాపాడు కోవడం కోసం అన్ని రంగాలలో జనాభా దామషా ప్రకారం వాటా కోసం, విద్య, ఉద్యోగాలలో, అధికారం లో, ప్రకృతి సంపద లో మన వాటా కోసం, బావితరాలకు రాజ్యాంగ ఫలాలు అందించే బాధ్యత కోసం మనం ఐక్యతతో ముందుకు సాగాలని లక్ష్యంతో పని చేస్తున్న రిజర్వేషన్ల పరిరక్షణ సమి(ఆర్.




పి. ఎస్ ). మరియు రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్. ఈ. యఫ్ ). ఆధ్వర్యంలో బహుజన ఉద్యోగ, ఉపాధ్యాయ, వృత్తి నిపుణుల ళిడాక్టర్ లు, చార్టెడ్ అకౌంటెడ్ లు, ఇంజనీర్ లు, సాఫ్ట్ వేర్ నిపుణులు, న్యాయ వాదులు రి సదస్సు ను ఏర్పాటు చేయడం జరుగును.

ఈ సదస్సు లో నిజాయితీ గా సేవలు అందించిన వారికి సత్కారం చేయడం జరుగుతుంది. ఈ సదస్సు కు గ్రేటర్ రాయలసీమ జిల్లాల పరిధిలో ఉన్న బహుజన ఉద్యోగుల ను, వృత్తి నిపుణులను ఆహ్వానిస్తున్నాము, సదస్సును విజవంతం చేయవలసిన బాధ్యత ప్రతి బహుజన బిడ్డ కు ఉంది.

## జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం

అనంతపురం, మే16 (అనంత ప్రభ)

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయ ఆవరణంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా కార్యాలయావరణం శుభ్రపరచడం జరిగింది. అలాగే కార్యాలయ సిబ్బంది చేత స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర లో ప్రతి ఒక్కరం భాగసా-్వములు అవుతామని మే నెల ప్లాస్టిక్ రహిత రాష్ట్రం అన్న నినాదంతో నా పరిసరాల పరిశుభ్రత తో పాటు ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉంటానని ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి ప్రజారోగ్యానికి హానికరమని గుర్తించి సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు బాధ్యత వ్యవహరిస్తానని సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువు లను ఉపయోగించకుండా ఉండేందుకు కృషి చేస్తానని గుడ్డ సంచులు జ్యూట్ బ్యాగులు పునర్వినియోగ పాత్రలు మరియు పర్యావరణ హిత వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తానని ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సరైన విధంగా వేరుచేసి నిర్వహించేందుకు కట్టుబడి ఉంటానని నా ఇల్లు కార్యాలయం మరియు పరిసరాల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు




సహకరిస్తానని ప్రజల్లో ప్లాస్టిక్ కాలుష్య హాని కారక ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని అలవాటును ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్ని అవుతానని స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర సాధనలో ప్లాస్టిక్ రహిత రాష్ట్రం నిర్మాణానికి నా వంతు బాధ్యతగా నిబద్ధతతో పనిచేస్తానని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఇన్చార్జ్ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజ మనోహర్రావు, డాక్టర్ సురేందర్ రెడ్డి, డెమో నాగరాజు, పీఎంఓ నాగన్న, హెచ్ ఈ ఓ గంగాధర్, ఎన్ హెచ్ ఎం కిషోర్, పనింద్ర ,వెంకటేష్, బలరామిరెడ్డి,, సురేష్ శ్రీనివాసులు, ఈశ్వరయ్య మొదలగు వారు పాల్గొన్నారు.

## భ్రూణ హత్యలు నిరోధానికి ముప్పేట దాడి తప్పనిసరి..... జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ

అనంతపురం, మే16 (అనంత ప్రభ)

కడుపులో ఆడబిడ్డ అని తెలిసినంతనే అబార్షన్ పేరుతో చిదిమి వేయడం నిర్మూలించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమానితులపై నిఘా ఉంచాలని పెంచాలని జిల్లా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ కమిటీ తీర్మానించింది. జిల్లా ఇన్చార్జ్ డిఎంహెచ్ఓ సి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జిల్లావైద్యాధికారికార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ జరగకుండా తీసుకుంటున్న చర్యలు వివరించారు. అవగాహన శిబిరాలు, చట్టం గురించి హెచ్చరికలు అందిస్తున్నట్లు చెప్పారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుకు ప్రతిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా వరకట్న సమస్య ఆడపిల్లలకు రక్షణ లేకపోవడం వలన ఆడపిల్లలు అంటేనే బరువు బాధ్యత అనే దృక్పథముతో ఉండడం అలాగే మగపిల్లలే వంశోద్ధారకులు అనే వివిధ రకాల మూడ నమ్మకాల వలన లింగ వివక్షకు ముఖ్య కారణాలని వివరించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు చెప్పమని అడిగినా అడగమని ప్రోత్సహించిన మరియు చెప్పిన వారికి మొదటి తప్పుకు చట్టప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష మరియు 50 వేల రూపాయలు జరిమానా విధించబడుతుందని డిఎంహెచ్ హెచ్చరిస్తూ స్పష్టం చేశారు. మరి ముఖ్యంగా ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో లింగ నిర్ధారణ చట్టరీత్య నేరమని గర్భిణీ స్త్రీ కుటుంబ సభ్యులలో ఉన్న అపోహలను తొలగించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

ఆర్డిటి హెల్త్ డైరెక్టర్ దుర్గేష్ మాట్లాడుతూ రాబోవు తరాల్లో లింగ వివక్ష




రూపుమాపేందుకు, ఉన్నత పాఠశాల, కళాశాలలో వకృత్వ వ్యాసరచన, స్క్రిప్ట్, పోటీలు నిర్వహించాలని, లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లను గుర్తించేందుకు పౌరుగుసేవలువినియోగించుకోవాలని, ఇద్దరు కంటే ఎక్కువ ఆడపిల్లలు ఉండి గర్భ-వతులుగా ఉన్న తల్లులను గుర్తించి వారిపై నిఘా ఉంచాలని కోరారు. ఆయన సూచనలను పలువురు సభ్యులు బలపరిచారు. లింగ నిర్ధారణ నిందితుల్ని గుర్తించిన ఫిర్యాదుదారులకు భారీ నగదు బహుమతులు ప్రకటించాలని పిడియాట్రిషన్ నవీన్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీతామాలక్ష్మి, డాక్టర్ సురేంద్ర నాథ్ రెడ్డి గైనకాలజిస్ట్, పెథాలజిస్ట్ భవాని, డెమో నాగరాజు న్యాయ సలహాదారులు ఆశ రాణి డిప్యూటీ మాస్ మీడియా అధికారి లక్ష్మీనారాయణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ వేణుగోపాల్, గంగాధర్, విజయ్ భాస్కర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి జన్మదిన వేడుకల్లో యువత క్రికెట్ సందడి






యాడికి, మే 16 (అనంత ప్రభ)

తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని యాడికిలో నిర్వహిస్తున్న జెసి స్ వై ఎం.పి.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. యాడికి మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ మైదానంలో టీడీపీ నాయకులు, జె.సి. అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమములో క్రీడాకారుల సమక్షంలో నాయకులు కేక్ కట్ చేసి ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టోర్నీని ప్రారంభించి ఆటగాళ్లతో కరచాలనం చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 53 జట్లు, సుమారు 700 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొంటుండటం విశేషం. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మ్యాచ్‌లను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. టోర్నీలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలు టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆది, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు టిడిపి సీనియర్ నాయకుడు గొర్తి రుద్రమ నాయుడు, తృతీయ బహు-మతిని టిడిపి టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ అందిస్తున్నారని, వాటితో పాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్ ట్రోఫీలను, టోర్నీ నిర్వహణ ఖర్చులను విజన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ్ మరియు వారి యొక్క టీం సహకారం అందించగా, జనసేన నాయకులు క్రీడాకారులకు చల్లని తాగునీటి సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జె.సి. అభిమానులు, క్రీడాకారులు, యు-వత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జె సి అస్మిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, మే 16 (అనంత ప్రభ)

తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని యాడికి మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డులో గల ఆగాపే వృద్ధాశ్రమంలో జె.సి. అభిమానులు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సెల్ పాయింట్ చాంద్ బాషా, ఫైబర్ చందు, ఫిరోజ్ బాషా, పూల తోట రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనాలను వడ్డించి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ మరియు వృద్ధులు ఎమ్మెల్యే జె.సి అస్మిత్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు పొందాలని, ఆయురారోగ్యాలతో కలకాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జె.సి. అభిమాని విశ్వనాథ్, సుభహాన్, దాసరి రామచంద్ర, మహమ్మద్ రఫీ, చికెన్ షాప్ వలి, పల్లా శివతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## రాయలచెరువులో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం



యాడికి, మే 16 (అనంత ప్రభ)

యాడికి మండలము రాయలచెరువు గ్రామంలోని ఎస్బిఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న కొట్టాల చివర భాగంలోని ఇండ్లకు తాగునీరు సరఫరా కాకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామపంచాయతీ కార్యదర్శి సాయి అరుణ్ కుమార్ వెంటనే స్పందించి డిప్యూటీ ఎంపీడీవో శశికళ, మాజీ ఎంపీపీ రంగయ్యతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టి ఆయా ప్రాంతాల్లో నీటి ట్యాంకును ఏర్పాటు చేయించారు

## లీలావతి వృద్ధాశ్రమంలో జెసి అస్మిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



యాడికి, మే 16 (అనంత ప్రభ)

తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని లీలావతి వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు, జేసీ కుటుంబ అభిమాని గండికోట లక్ష్మణ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కేక్ కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులకు పంపిణీ చేశారు. తరువాత వృద్ధులకు భోజనాలు వడ్డించారు. ఎమ్మెల్యే జె సి అస్మిత్ రెడ్డి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వృద్ధులు ఆశీర్వదించారు. సమాజ సేవే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పరిమి విక్రం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జనగణనపై మండల అధికారుల సమావేశం



యాడికి, మే 16 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీవో వీరరాజు ఆధ్వర్యంలో జనగణన నిర్వహణపై మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనగణన ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించారు. ఇంటింటి వివరాల సేకరణలో ఖచ్చితత్వం పాటించాలని, ప్రజలకు జనగణన ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని, సిబ్బంది తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని అధికారులు ఆదేశించారు. జనగణన కార్యక్రమాన్ని ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో శశికళ, యాడికి గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి అరుణ్ కుమార్, ఎంఈఓ కాశప్ప, ఐసీడీఎస్ సూపర్వైజర్లు విజయకుమారి, శంషాద్ బేగం, ఏపీఎం చంద్రశేఖర్, ఏపీఓ మద్దిలేటి, హౌసింగ్ ఏఈ లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## చురుగ్గా సాగుతున్న జనగణన కార్యక్రమం



కూడేరు, మే 16 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలో జనగణన కార్యక్రమం వార్డుల వారిగా చురుగ్గా సాగుతోంది. సచివాలయ ఉద్యోలు వారికి అప్పజెప్పిన విధులు నిర్వహిస్తూనే ప్రభుత్వ నిర్దేశించిన సమయానికి జనాభా లెక్కల నివేదికను ప్రభుత్వానికి సమర్పించేందుకు అదనపు పనులను సైతం క్రమం తప్పకుండా తమ విధులు నిర్వహిస్తూనే జనగణన కార్యక్రమాలు లెక్కించడానికి సచివాలయ ఉద్యోగులు ఇల్లు ఇల్లు తిరుగుతూ ఇంటి వద్ద కుటుంబంలోని కుటుంబ సభ్యుల వివరాలను లెక్కిస్తూ బాధ్యతగా జనాభా లెక్కలు తయారు చేస్తున్నారు. సచివాలయ అధికారులు సర్వే నిర్వహిస్తున్న క్రమంలో అధిక ఉష్ణోగ్రతలును ఎండను సైతం లెక్కచేయకుండా కుటుంబ సభ్యులు ఇంటి వద్ద లేకున్నా పదేపదే అదే ఇంటి వద్దకే తిరుగుతూ సాయంత్రం 6 గంటల సమయం అయినా విశ్రాంతి లేకుండా కుటుంబ సభ్యుల వివరాల ను సేకరించి జన గణన రికార్డుల్లో పొందుపరుస్తూ జనాభా లెక్కలు తయారు చేస్తున్నారు.

## ఆదోనిలో "స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ




ఆదోని, మే 16 (అనంత ప్రభ)

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న "స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఆదోని నియోజకవర్గంలోని మండిగిరి గ్రామ పరిధిలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, డీఎల్పీవో తిక్కమ్మ పాల్గొన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ, పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని గుడిసె ఆది కృష్ణమ్మ పిలుపునిచ్చారు. మండిగిరి అర్బన్ గ్రామ పంచాయతీలో "గ్రీన్ అంబాసిడర్" కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్తను షెడ్యూల్ ప్రకారం కేంద్రానికి తరలించి, అక్కడ తడి చెత్త -- పొడి చెత్తగా వేరు చేసి సేంద్రీయ ఎరువులుగా తయారు చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 10 పొదుపు సంఘాల మహిళలకు ఎంఓయూ పత్రాలు అందజేశారు. ఈ మహిళలు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సేంద్రీయ ఎరువుల తయారీలో భాగస్వామ్యం కావడంతో పాటు గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇటువంటి కార్యక్రమాలు గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఎంతో ఉపయోగపడతాయని గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, మాజీ ఎంపీపీ మురళి, బజారప్ప, దేవేంద్ర, బాబురావు, సాధిక్ వలి, రవి, అసెన్ భాష, గ్రీన్ అంబాసిడర్ కార్మికులు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు

## నిజాముద్దీన్ కాలనీలో అగ్నిప్రమాదం - గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్యతో ₹1.50 లక్షల ఆస్తి నష్టం



ఆదోని, మే 16 (అనంత ప్రభ)

నిజాముద్దీన్ కాలనీ ప్రాంతంలో ఈరోజు చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటన స్థానికులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. అలీషా బాయ్ ఇంటి పక్కన ఉన్న గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే నిప్పు అంటించినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఈ ప్రమాదంలో గడ్డివాము పూర్తిగా దగ్ధమై సుమారు ₹1,50,000/- వరకు ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. స్థానికుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చినప్పటికీ అప్పటికే భారీ నష్టం సంభవించినట్లు తెలుస్తోంది.

ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి, ఘటనకు బాధ్యులైన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే నష్టపోయిన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని, తక్షణ ఆర్థిక సహాయం మరియు తగిన నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. ఇటీవల ఇటువంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, కాలనీల్లో రాత్రి వేళల్లో పహారా వ్యవస్థను బలోపేతం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. "ప్రజల ఆస్తుల రక్షణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి"

## శ్రీ సత్య సాయి వాటర్ ప్రాజెక్ట్ లో పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లించండి



ఆత్మకూరు, మే 16 (అనంత ప్రభ)

అనంతపురం , శ్రీ సత్య సాయి జిల్లా ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికుల కు సరిగా జీతాలు చెల్లించడం లేదని సమ్మె బాట పట్టిన విషయం అందరికీ తెలిసిందే, అయితే ఈ సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. శ్రీ సత్య సాయి వాటర్ ప్రాజెక్ట్ లో పనిచేస్తున్నప్పటికీ కార్మికులకు అందరికీ గత ఐదు నెలలుగా ప్రభుత్వం గానీ కాంట్రాక్టర్లు గాని జీతాలు చెల్లించడం లేదని జీతం మీద ఆధారపడి జీవిస్తున్న మాకు జీతాల ఇవ్వకపోతే కుటుంబ పోషణ భారమవుతుందని ఐదు నెలలుగా రవాణా ఖర్చులు కూడా భరించలేక కార్మికులంతా సమ్మె లోకి పోవడం జరిగినది, కార్మికులందరికీ తక్షణమే పెండింగ్లో ఉన్న పాత బకాయిలను చెల్లించే విధంగా కార్మికుల యొక్క సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో లక్ష్మీ నరసింహ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో శివ, శ్రీరాములు, హరి, ఓబన్న, అనీల్, వెంకటేష్ నాయక్, మల్లికార్జున, రమేష్ రెడ్డి పాల్గొనడం జరిగినది

## కుప్పగల్‌లో "ఆపరేషన్ వజ్రప్రహార్" డ్రగ్స్ నియంత్రణపై పోలీసుల కార్డన్ సెర్చ్ -- 48 బాటిళ్ల అక్రమ మద్యం స్వాధీనం



ఆదోని, మే 16 (అనంత ప్రభ)

రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం చేపట్టిన "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా కర్నూలు జిల్లా పోలీసులు శనివారం ఉదయం పెద్దతుంబలం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుప్పగల్ గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక బృందాలు గ్రామంలోని హాట్‌స్పాట్ ప్రాంతాలు, అద్దె ఇళ్లు, ఖాళీ భవనాలు, పాత గంజాయి కేసుల ముద్దాయిల ఇళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో ఆదోని రూరల్ సీఐ నల్లప్ప, ఆదోని 2 టౌన్ సీఐ రాజశేఖర్, 1 టౌన్ ఎస్ఐ విజయ్‌కుమార్, పీసీఆర్ ఎస్ఐ గోపాల్, పెద్దతుంబలం ఎస్ఐ విద్యాశ్రీతో పాటు సుమారు 25 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా ఇద్దరు అనుమానితులను విచారించగా, పాత గంజాయి కేసులో ఉన్న ఓ వ్యక్తికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామ రైతులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఇదే సమయంలో 48 బాటిళ్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే ట్రబుల్ మాంగర్స్, అనుమానిత వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించారు. యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల ఆరోగ్యపరంగా, సామాజికంగా తీవ్ర నష్టం జరుగుతుందని పోలీసులు వివరించారు. ప్రజలు తమ పరిసరాల్లో డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే ఏపీ ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అనంతరం అధికారులు, సిబ్బంది, గ్రామస్తులతో కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" చేపట్టి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## గుంతకల్ మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి పనితీరు అమోఘం కమిషనర్‌ను సత్కరించిన జనవిజ్ఞాన వేదిక



గుంతకల్లు, మే 16 (అనంత ప్రభ)

గుంతకల్ మున్సిపల్ కమిషనర్ ఎం.లక్ష్మీదేవిని జనవిజ్ఞాన వేదిక నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. గుంతకల్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎస్.హరి ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తక్కువ కాలంలోనే గుంతకల్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో లక్ష్మీదేవి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని చెప్పారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, పార్కుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాల్లో ప్రత్యేక కృషి చేస్తున్నారని కొనియాడారు. మున్సిపల్ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ గుంతకల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు నారాయణస్వామి, చంద్రశేఖర్, కృష్ణసింగ్, సుధాకర్, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ భూములను సర్వే చేస్తున్న రీ సర్వే అధికారులు




కూడేరు, మే16 (అనంత ప్రభ)

కూడేరు మండలం కమ్మూరు రెవిన్యూ గ్రామం నందు ఫారెస్ట్ రిజర్వ్ సర్వే నంబర్లు 1,2,6,7,8,9,25,27,28,29,30,69,73,74,75,87,88,94బి/2,సి/1, 129ఎ,బి,131, 135ఎ,135బి/2,136, ఎ,137 బి,138,199,285 ఎ,బి,286,287, ఎ,బి గల భూములు దాదాపు 1625.48 ఎకరాల విస్తీర్ణానికి ఫారెస్ట్ రిజర్వు అధికారులకు నోటీసులు అందజేసి వారి సమక్షంలోనే రీ సర్వే అధికారులు శనివారం రోజున నాలుగో విడత భూ రీ సర్వే నిర్వహిస్తా ఉన్నారు . ఈ కార్యక్రమంలో భూరీ సర్వే అధికారులు, ఫారెస్ట్ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మాధవి పాల్గొన్నారు.

## రాయలచెరువులో ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి జన్మదిన సంబరాలు



యాడికి, మే 16 (అనంత ప్రభ)

యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల టీడీపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటూ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ యాడికి మండల అభివృద్ధికి కృషి చేసస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్, మాదాల అనిల్, గోపాల్ నాయుడు, నెట్టికంతయ్య, జాఫర్,తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డెంగ్యూ నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం




యాడికి, మే 16 (అనంత ప్రభ)

జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా యాడికి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కోన రోడ్డు, బస్టాండ్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో డెంగ్యూ నిర్మూలన మనందరి బాధ్యత, పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల నివారణ చర్యలు పాటించాలని వైద్య అధికారులు సూచించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామూహిక బాధ్యతను కూడా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జుబేదా, పీఎంఓ రామచంద్ర, పీహెచ్ఎం శోభకుమారి, సూపర్వైజర్లు రాంప్రసాద్ గౌడ్, విజయ్ కుమారి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, ఎంపీహెచ్ఏ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద తుంబలం గ్రామంలో నీటి సమస్యలపై ప్రత్యేక పరిశీలన



ఆదోని, మే 16 (అనంత ప్రభ)

ఆదోని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి ఆదేశాల మేరకు పెద్ద తుంబలం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా పరిశీలనలు నిర్వహించారు. గ్రామంలో నీటి సరఫరా పరిస్థితిని పరిశీలిస్తూ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ--టిడిపి నాయకులు కొండాపురం నరసరెడ్డి, కొండ గోవిందరాజులు, షరీఫ్, నరసప్ప, శ్రీనివాసులు, కె.వీరేష్ తదితర నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నాయకులు తెలిపారు.









## నిమ్మరసం రోజూ తాగితే.. ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?



పసుపు పచ్చని రంగులో నిగనిగలాడే నిమ్మ ప్రకృతి మనకు ప్రసాదించిన ఓ అద్భుతమైన వరం. ఈ పుల్లటి, గుండ్రని పండులో ప్రోటీన్, కొవ్వు, విటమిన్ సి, కాల్షియం, ఫోలేట్, పొటాషియం వంటి పోషకాల పవర్‌హౌస్. పోషకాలతో నిండి ఉన్న నిమ్మ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి, గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తాయి, మూత్రపిండాల్లో రాళ్లను నివారిస్తాయి. శరీర కణజాలం పెరుగుదల, అభివృద్ధి, మరమ్మత్తుకు విటమిన్ సీ కీలక పాత్ర పోషిస్తుంది. వేసవిలో నిమ్మరసం.. బెస్ట్ రిఫ్రెష్ డ్రింక్ అని చెప్పొచ్చు. నిమ్మరసం రోజూ తీసుకుంటే.. మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

గొంతు నొప్పి నుంచి ఉపశమనం ఇస్తుంది..

గొంతు నొప్పి నుంచి ఉపశమనం ఇస్తుంది..

నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది గొంతును శుభ్రపరుస్తుంది, మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మీరు గొంతు నొప్పితో బాధపడుతుంటే.. ఒక గ్లాస్ గోరువెచ్చని నీళ్లలో అరస్పూన్ తేనె, స్పూన్ నిమ్మరసం కలిపి తాగితే మీకు త్వరగా ఉపశమనం లభిస్తుంది.

కిడ్నీలో రాళ్లను దూరంగా ఉంచుతుంది..

నిమ్మరసం మూత్రంలో సిట్రేట్ స్థాయిలను పెంచి.. మూత్రపిండాల్లో రాళ్లను నివారిస్తుంది. సిట్రేట్ కాల్షియంకు అతుక్కుంటుంది, ఇది మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా సహాయపడుతుంది.

జీర్ణక్రియకు మేలు చేస్తుంది..

నిమ్మరసం, నిమ్మ తొక్కలో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది లివర్‌లో జీర్ణ ఎంజైమ్‌ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తుంది. ఇది మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు ఉన్నవారు నిమ్మరసం తీసుకుంటే చాలా మంచిది. నిమ్మరసం మీ శరీరం నుంచి వ్యర్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. (%అఝుస్త్రవ

%బ్లడ్ షుగర్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది..

నిమ్మరసంలో ఫైబర్ మెండుగా ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్‌ని అదుపులో ఉంచుతుంది.. తద్వారా చక్కెర స్థాయిలు కంట్రోల్‌లో ఉంటాయి. నిమ్మరసం తీసుకుంటే డయాబెటిస్ వచ్చే ముప్పు తగ్గుతుంది. షుగర్ పేషెంట్స్ రోజూ నిమ్మరసం తాగితే.. రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్‌లో ఉంటాయి.

బరువు తగ్గుతారు..

నిమ్మకాయలో పెక్టిన్ ఉంటుంది. నిమ్మరసం మీకు కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. నిమ్మరసంలో ఫైబర్ మెండుగా ఉంటుంది.. దీనిలో ఉండే లో డెన్సిటీ ఫైబర్ శరీరంలో పేరుకున్న కొవ్వును కరిగించడానికి, బరువు తగ్గించడానికి సహాయపడుతుంది.

యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి..

ఇమ్యూనిటీ బూస్ట్ అవుతుంది..

నిమ్మకాయల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది మన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. విటమిన్ సి మన శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. విటమిన్ సి వాపును తగ్గిస్తుంది, కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి.. గాయాలు వేగంగా మానేలా తోడ్పడుతుంది. నిమ్మరసం యాంటీ ఆక్సిడెంట్ల అద్భుతమైన మూలం. ఇది ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా.. మీ కణాలను రక్షించి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది



## కొబ్బరి నూనెలో ఇది కలిపి రాస్తే చుండ్రు తగ్గి జుట్టు బాగా పెరుగుతుంది..

జుట్టు అందంగా, షైనీగా ఉంటే ఆ అందం అంత ఇంత కాదు. చూడ్డానికి అందమైన జుట్టు కావాలని అందరికీ ఉంటుంది. కానీ, అనేక కారణాలతో చాలా మంది జుట్టు సమస్యలతో బాధపడుతుంటారు. అందులో జుట్టు రాలడం, చిట్లిపోవడం, చుండ్రు సమస్యలు ఉంటాయి. అయితే, ఇందులో చుండ్రు సమస్య దూరమవ్వాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. అవేంటో ఇప్పుడు చూద్దాం.

కర్పూరం..

కర్పూరాన్ని చాలా మంది తమ ఇళ్ళలో వాడుతుంటారు. దీని వల్ల జుట్టుకి కూడా మేలు జరుగుతుంది. కర్పూరాన్ని కొబ్బరినూనెలో కలిపి రాయడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అవేంటో చూద్దాం.

చుండ్రు..

కొబ్బరి నూనె, కర్పూరాన్ని కలిపి రాయడం వల్ల అది బలమైన యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కలిగి ఉంటుంది. ఈ రెండింటికి కలయిక వల్ల స్కాల్ఫ్ ఫంగస్, బ్యాక్టీరియా, దురద, అలర్జీలు దూరమవుతాయి.

పేలు..

చాలా మంది పేల సమస్యతో తెగ ఇబ్బంది పడతారు. కర్పూర నూనె ఆ సమస్యకి కూడా చెక్ పెడుతుంది. కర్పూరంలోని యాంటీ పరాసిటిక్ లక్షణాలు ఉన్నాయి. ఇవి పేలను దూరం చేస్తాయి. దీని కోసం రెండు చెంచాల కొబ్బరి నూనె, ఓ చెంచా కర్పూరాన్ని కలిపి పేస్టులా చేసి తలకి పట్టించి రాత్రంతా అలానే ఉంచి క్లీన్ చేసుకోవాలి.

జుట్టు రాలడం దూరం..

చాలా వరకూ చుండ్రు ఎక్కువగా ఉండడం వల్లే జుట్టు రాలుతుంటుంది. అలాంటప్పుడు కొబ్బరినూనెలో కర్పూరాన్ని కలిపి రాయడం వల్ల జుట్టు సమస్యలు దూరమై జుట్టు బలంగా మారత్నుంది.

తెల్ల జుట్ట దూరం..

కర్పూరం, కొబ్బరినూనె జుట్టు పెరుగుదలలో వచ్చే సమస్యల్ని దూరం చేసి పొడవుగా, మందమైన జుట్టుని పొందేందుకు సాయపడుతుంది. ఈ నూనె రాయడం వల్ల జుట్టు తెల్లబడే సమస్యని కూడా దూరమవుతుంది.

జుట్టుకి మెరుపు..



కొంతమంది జుట్టుని చూస్తే నిర్జీవంగా మారి ఇబ్బందిగా కనిపిస్తుంది. ఇలాంటి సమస్య దూరమయ్యేందుకు, జుట్టు మృదువుగా మారేందుకు కర్పూర నూనె బాగా హెల్ప్ అవుతుంది.

ఎలా వాడాలి..

మీకు ఎంత నూనె అవసరమో అది తీసుకుని అందులో ఒకటి లేదా రెండు కర్పూర బిళ్ళలను వేయాలి. మొత్తం కరిగాక దానిని జుట్టుకి అప్లై చేయాలి. దీని వల్ల తల చల్లగా అనిపిస్తుంది. స్కాల్ప్ సున్నితంగా మారతుంది. అలా రాశాక.. 4 గంటలు వీలైతే రాత్రంతా ఉంచండి. ఇలా వారానికి 2 నుంచి 3 సార్లు చేయండి. దీంతో బెస్ట్ బెనిఫిట్స్ మీ సొంతమవుతాయి.

## ఈ మూలికతో రక్తంలో యూరిక్ యాసిడ్స్ తగ్గుతాయట..

ఆయుర్వేదంలో ఎన్నో మూలికలు ఉన్నాయి. వీటిని అనేక సమస్యలకి పరిష్కారంగా పనిచేస్తాయి. వీటిలో ఎక్కువగా తులసి, తిప్పతీగ, అశ్వగంధ గురించే తెలుసు. కానీ, తెలుసుకోవాల్సిన మరో మూలిక కూడా ఉంది. అందులో ఒకటే నేల ఉసిరి.

ఆయుర్వేద నిపుణుల ప్రకారం..

నేల ఉసిరి లివర్, కిడ్నీ సమస్యలకి చక్కని పరిష్కారమని నోయిడా %జు%-260 సెక్టార్ 27లోని కపిల్ త్యాగి ఆయుర్వేద క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కపిల్ త్యాగి చెబుతున్నారు. దీనిని తీసుకోవడం వల్ల మరిన్ని లాభాలు కూడా ఉన్నాయని, జీర్ణక్రియ, ఇమ్యూనిటీ బలంగా మారుతుందని చెబుతున్నారు.

నేల ఉసిరి అంటే..

ఈ నేల ఉసిరి ఇప్పుడు కాదు.. సుమారు 2 వేల సంవత్సారకు ముందే ఆయుర్వేదంలో వాడారని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు ఆరోగ్యాన్ని కాపాడతాయి. దీని మొక్క చూడ్డానికి సన్నని ఆకులతో కొమ్మలతో నిండి ఉంటుంది. ఇది సుమారు 2 అడుగుల వరకూ పెరుగుతుంది. కేవలం ఈ మొక్క ఆకుల్నే కాదు పువ్వులు, కాండాన్ని కూడా అనేక రకాలుగా ఉపయోగిస్తారు.

కిడ్నీ సమస్యలు దూరం..

ఈ ఆయుర్వేద మూలికని తీసుకోవడం వల్ల మూత్రపిండాల్లోని రాళ్ళు తగ్గిపోతాయి. ఇందులోని ప్రత్యేక గుణాలు రాళ్ళని బ్రేక్ చేస్తాయి. అందుకే, దీనిని 'స్టోన్ బ్రేకర్' అంటారు. ఈ మూలికలోని ఆల్కలీన్ కిడ్నీలోని రాళ్ళని తగ్గిస్తుంది. మూత్ర విసర్జనని పెంచుతుంది. ఇతర మందుల కంటే దీనిని తీసుకోవడం వల్ల మందులా పని చేస్తుంది.

పిత్తాశయ రాళ్ళు కూడా..

దీనిని తీసుకోవడం వల్ల మూత్రపిండాల్లోని రాళ్ళు మాత్రమే కాదు. పిత్తాశయ రాళ్ళు కూడా దూరమవుతాయి. ఇందులోని ఆల్కలీన్ గుణాలే దీనికి కారణం. దీనిని ఈ సమస్యలకి పరిష్కారంగా కొన్ని రోజులుగా వాడుతున్నారు.

%గాశ్రీంశీ =ఝుం% : వీటిని తింటే గ్యాస్, మలబద్ధకం దూరమవుతాయి..

అల్సర్స్..

అల్సర్స్..

నేల ఉసిరి తీసుకోవడం వల్ల కడుపులోని అల్సర్స్ దూరమవుతాయి. కడుపులోని బ్యాక్టీరియాని దూరం చేసేందుకు ఇవి బాగా పనిచేస్తాయి. కడుపులోని సమస్యల్ని దూరం చేసేందుకు ఈ మూలిక బాగా పనిచేస్తుంది.

బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్..



యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు పుష్కలంగ ఉన్న నేల ఉసిరిని తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల డయాబెటిక్ పేషెంట్స్‌కి మంచిదని చెబుతున్నారు నిపుణులు. అయితే, దీనిని మీరు డాక్టర్ సలహాతోనే తీసుకోవాలని గుర్తుపెట్టుకోండి.

యూరిక్ యాసిడ్స్..

రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు గౌట్ సమస్య వస్తుంది. అలాంటి సమస్యని ఈ మూలిక దూరం చేస్తుంది. దీనిలో యాంటీ గౌట్ లక్షణాలు ఉంటాయి. వీటితో పాటు దీనిని రెగ్యులర్‌గా తీసుకుంటే ఆర్థరైటిస్ లక్షణాలు కూడా తగ్గుతాయి.

లివర్‌కి మంచిది..

లివర్ ఆరోగ్యాన్ని కాపాడడంలో నేల ఉసిరి ఆయుర్వేద టానిక్ అని చెప్పొచ్చు. దీనిని లివర్ ఆరోగ్యాన్ని కాపాడి, పిత్తాశయ పనితీరుని మెరుగుపరుస్తుంది.

ఇతర లాభాలు..


దీనిని తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థని మెరుగుపరిచి బలంగా తయారవుతుంది. ఇమ్యూనిటీ పెరుగుతుంది. స్కిన్ ప్రాబ్లమ్స్ దూరమై, కఫ, పిత్త దోషాలని బ్యాలెన్స్ చేస్తుంది.

ఎలా వాడాలి..

ఈ మూలికను పొడి, రసం, పేస్ట్ రూపంలో ఎలా అయినా తీసుకోవచ్చు. అయితే, డాక్టర్, ఆయుర్వేద నిపుణుల సలహాతోనే తీసుకోవాలి. వారు మిమ్మల్ని పరీక్షించి ఎంత తీసుకోవాలి.. ఎలా తీసుకోవాలో చెబుతారు. అప్పుడే మీ సమస్యలన్నీ దూరమవుతాయి.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టో వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేర-ువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పు-రస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉ-ంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస-్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలే-సుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉ-ంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మా-త్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉ-ంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్ మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభి-ప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com